జూలై 1న విజయవాడలో జాతీయ వైద్యుల దినోత్సవం

విజయవాడ ప్రజాపాలన : జూలై 1న నిర్వహించే జాతీయ వైద్యుల దినోత్సవాన్ని విజయవాడలోని డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా భారతరత్న డా. బి.సి. రాయ్ విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు, వైద్య సేవలు, విద్య, పరిశోధన, సమాజ సేవల్లో విశిష్ట సేవలందించిన 10 మంది ప్రముఖ వైద్యులను సత్కరించనున్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అల్లోపతి, దంత, నర్సింగ్, ఆయుర్వేదం, హోమియోపతి, యునాని రంగాల వైద్యులను కూడా ఈ సందర్భంగా గౌరవించనున్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి:నగరపాలక సంస్థ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతగా స్వీకరించి శాశ్వత పరిష్కారం అందించాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఆయన, ప్రజల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని సూచించారు. ఈ సోమవారం మొత్తం 14 ఫిర్యాదులు అందగా, అక్రమ నిర్మాణాలు, రోడ్ల ఆక్రమణలపై అధికంగా ఫిర్యాదులు నమోదయ్యాయి. "పురమిత్ర" యాప్‌లో వచ్చే ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ ఏపీ వైస్ చైర్మన్‌గా బాలసుబ్రహ్మణ్యం నియామకం

న్యూఢిల్లీ, జూన్ 29: ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ నర్సాపురం నమూనాశంలో గుంటూరుకు చెందిన చక్రాల బాలసుబ్రహ్మణ్యంను ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్‌గా నియమించారు. ఈ సందర్భంగా యాక్టివ్ చైర్మన్ శుభోద్ దళాల్ నియామక పత్రాన్ని అందజేశారు. బ్యాంకింగ్ రంగంలో 23 ఏళ్ల అనుభవం కలిగిన బాలసుబ్రహ్మణ్యం, హౌసింగ్, వ్యవసాయ, పరిశ్రమల రుణాలతో పాటు స్టార్టప్‌లు, దౌత్యాహిక వ్యాపారవేత్తలకు సేవలందించిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంస్థ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని, రైతులు, మహిళా సాధికారత, స్టార్టప్‌ల ప్రోత్సాహానికి ప్రత్యేకంగా పనిచేస్తానని పేర్కొన్నారు.

రెడ్ బుక్ రాజ్యాంగం అమలుపై లోకేష్‌ను చంద్రబాబు మందలించాలి: మాజీ ఎంపీ భరత్

రాజమహేంద్రవరం, ప్రజాపాలన : రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా లోకేష్ "రెడ్ బుక్ రాజ్యాంగం" అమలు చేస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కుతూ వైసీపీ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆరోపించారు. రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగమే అమలవుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు భరోసా ఇవ్వాలని కోరారు. రాజధాని రైతుల సమస్యలపై పోరాడుతున్న వైసీపీ నేతలను పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని, విజయవాడ లాకప్ డెత్, ఇతర ఘటనలు శాంతిభద్రతల వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. వైసీపీ నేతలపై దాడులకు పాల్పడిన వారిపై ప్రభుత్వం సుమోటోగా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో కక్షసాధింపు చర్యలు తగవని, చట్టం, న్యాయపరమైన పరిధిలోనే సమస్యలను పరిష్కరించాలని సూచించిన భరత్, భవిష్యత్తులో చర్యలకు ప్రతి చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఎమ్మెల్సీ సోము వీర్రాజును తాను లేదా తన డ్రైవర్ అసభ్యంగా దూషించలేదని స్పష్టం చేశారు. ప్రజా సేవా కార్యక్రమాల్లో భాగంగా కంటి వైద్య శిబిరం లబ్ధిదారులకు సుమారు 250 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

కీర్తిశేషులు కటికల రామకోటి 24వ వర్ధంతి సందర్భంగా

చిన్నారికి వీల్‌చైర్ అందజేత

సాత్విక్‌కు అండగా నిలిచిన ప్రధానోపాధ్యాయుడు గురజాల శ్రీనివాసరావు

బాపట్ల, జూన్ 29 (ప్రజాపాలన ప్రతినిధి): కీర్తిశేషులు కటికల రామకోటి (జార్జి) 24వ వర్ధంతి సందర్భంగా బాపట్ల మండలం ముత్తాయిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థి వీరమల్లు సాత్విక్‌కు వీల్‌చైర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురజాల శ్రీనివాసరావు అందజేశారు. పల్లెపాలెం గ్రామం నుంచి ప్రతిరోజూ తల్లి సహాయంతో చేతులపై ప్రాకుకుంటూ పాఠశాలకు వస్తున్న సాత్విక్ పరిస్థితిని గమనించిన ప్రధానోపాధ్యాయులు, అతని విద్యాభ్యాసానికి ఇబ్బందులు తొలగించే ఉద్దేశంతో తమ సొంత నిధులతో వీల్‌చైర్ కొనుగోలు చేసి, స్వర్గీయ కటికల రామకోటి 24వ వర్ధంతి సందర్భంగా అందజేశారు. ఈ సందర్భంగా గురజాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, కటికల రామకోటి స్థాపించిన కటికల కాంతమ్మ హెల్ప్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా చింతలపూడి, పొన్నూరు ప్రాంతాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి వేలాది మందికి అండగా నిలిచారని గుర్తు చేశారు. ఆ మహనీయుడి సేవా స్ఫూర్తిని స్మరించుకుంటూ ఆయన జ్ఞాపకార్థం సాత్విక్‌కు వీల్‌చైర్ అందించడం ఆనందంగా ఉందన్నారు. తాను గతంలో కటికల కాంతమ్మ హెల్ప్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ, స్నేహ సంస్థల ద్వారా సహాయం పొందినందుకు కృతజ్ఞతగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహోపాధ్యాయులు టీ. విజయలక్ష్మి, డి. వందనకుమారి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ కర్రి అరుణ, విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వర్గీయ కటికల రామకోటి 24వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటిస్తూ ఘనంగా జోహార్లు అర్పించారు.

ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి వేధిస్తున్నారు

ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్

విజయవాడ, జూన్ 29 (ప్రజాపాలన ప్రతినిధి : రాష్ట్రంలో కూటమి పాలన రౌడీ రాజ్యాన్ని తలపిస్తోందని, అమరావతిలో రైతులపై అన్యాయాలు జరుగుతున్నాయని ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆరోపించారు. రైతుల సమస్యలు తెలుసుకునేందుకు అమరావతికి వెళ్లగా పోలీసులు టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరించారని విమర్శించారు. అమరావతి అభివృద్ధికి వైసీపీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, అక్కడ జరుగుతున్న అవినీతి, అక్రమాలకే వ్యతిరేకమని స్పష్టం చేశారు. అమరావతి రైతులకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి వేధిస్తున్నారని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, జూన్ 29 (ప్రజాపాలన ప్రతినిధి : జిల్లాలో ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని అధికారులు బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక – మీకోసం' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, పలు సమస్యలపై సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. చింతకుంటపాలెం గ్రామానికి చెందిన అనాథ విద్యార్థినికి ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెదపారుపూడి మండలంలో సీఎస్‌ఆర్ పర్చి భవనంలో నడుస్తున్న పాఠశాలకు శాశ్వత భవన నిర్మాణంపై విద్యాశాఖ అధికారులను చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసిన పాకిస్థాన్ పౌరురాలి ఫీజు చెల్లింపు ప్రక్రియపై తగిన మార్గదర్శకాలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణగ్రామం కార్యాలయం తనిఖీ

ప్రాధాన్య కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆరా

ఎన్‌టీఆర్ జిల్లా, ప్రజాపాలన : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం విజయవాడ గ్రామీణం పరిధిలోని గొల్లపూడి స్వర్ణగ్రామం కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై కార్యాలయం, సిబ్బంది పనితీరును పరిశీలించారు. బీఎల్‌వోల ద్వారా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరుగుతున్న తీరుతో పాటు ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యతను మెరుగుపరచడంతో పాటు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. పురోగతిని నిత్యం సమీక్షించడం జరుగుతోందని.. సమష్టి కృషితో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏదైనా కారణం వల్ల అదివారం పోలియో చుక్కలు వేసుకోని వారికి సోమవారం, మంగళవారం రోజుల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్నారు. ఈ కార్యక్రమంలోనూ కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. సిబ్బంది అందిస్తున్న సేవలను పరిశీలించారు.

ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత

– జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ఎన్‌టీఆర్ జిల్లా,ప్రజాపాలన :ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత కల్పించడం జరిగిందని.. అయినప్పటికీ నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సోమవారం కలెక్టర్ లక్ష్మీశ గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక విద్యుత్ పరికరాలను పరిశీలించి అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరిస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహంతో పాటు ఏదుపాటి రామయ్య (తెదేపా), వై.అంజనేయ రెడ్డి (వైఎస్ఆర్‌సీపీ), మురళీకృష్ణ (ఐఎన్‌సీ), జడగం శ్రీనివాసరావు (జనసేన పార్టీ) తదితరులు పాల్గొన్నారు.